విశాలాంధ్ర
తిరుపతి జిల్లా
చిత్తూరు జిల్లా
ఆదివారం 13 జులై 2025 8 పేజీలు

సుపరిపాలన కూటమి ప్రభుత్వానికే సాధ్యం

– జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర - చిత్తూరు: ప్రజా సంక్షేమ అభివృద్ధితో పాటు సుపరిపాలన కూటమి ప్రభుత్వానికే సాధ్యమని జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం చిత్తూర్ నగరం కాజూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ఇచ్చిన హామీలను దాదాపుగా అమలు చేయడం జరిగిందన్నారు.

2

నిరుద్యోగ అర్చకులకు టిటిడి భృతి

తిరుమలలో టీటీడీ, దేవాదాయ శాఖ సమన్వయ సమావేశంలో వెల్లడి

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, దేవాదాయ శాఖ కార్యదర్శి వినయ్ చంద్ కలిసి దేవాదాయ శాఖ, టీటీడీ మధ్య పెండింగ్‌లో ఉన్న సంయుక్త అంశాలపై శనివారం మధ్యాహ్నం తిరుమల అన్నమయ్య భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈవో, అదనపు ఈవో, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి సమీక్ష చేశామన్నారు. దేవాదాయ చట్టం ప్రకారం 9 శాతం కామన్ గుడ్ ఫండ్ టీటీడీ నుంచి తీసుకోవాల్సిన నిబంధనలు ఉన్నాయి. గతంలో 5 శాతం ఉన్న దానిని 9 శాతంకు పెంచామన్నారు. రాష్ట్రంలో ఉన్న అర్చక నిరుద్యోగులుగా ఉన్న అర్చక స్వాములకు

2లో

రైతుల గురించి ఆలోచించే ఏకైక ప్రభుత్వం..

కూటమి ప్రభుత్వమే

- నెల్లేపల్లి 'సుపరిపాలనలో తొలి అడుగు'లో మంత్రులు

విశాలాంధ్ర - గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని నెల్లేపల్లి పంచాయతీ పరిధిలో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, యువజన క్రీడా శాఖ మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ రావు, గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వివిఎం థామస్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన సూపర్ సిక్స్ పథకాలు రాష్ట్రంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ప్రజలు కూడా వచ్చిన ప్రజా ప్రతినిధులకు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనలో మాకు అన్ని పథకాలు అందుతున్నాయని సూపర్ సిక్స్ పథకాల ద్వారా మాకు ఎంతో చేయూత ఇస్తున్నాయని మంత్రులకు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో

- వార్త 2లో

అంచలంచలుగా..

చెరువులు కబ్జా

- చెరువులను పూడ్చి ఏకంగా చెరువుల్లోనే పంటలు పండిస్తున్నవైనం
- చెరువులలో నీరులేక ఇంకుతున్న బోరుబావులు
- కబ్జాలను ఆపాలంటూ రైతులు వినతి

- వార్త 2లో

కూటమి ప్రభుత్వానికే సాధ్యం

(మొదటి పేజీ తరువాయి) సంక్షేమ అభివృద్ధి కి పెద్దపీట వేస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలన్నారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే శక్తి సామర్థ్యాలు ఒక కూటమి ప్రభుత్వానికే ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చూడ చైర్పర్సన్ కటారి హేమలత, నగర మేయర్ అముద,మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు కాజూరు బాలాజీ, చల్లా రామచంద్ర రెడ్డి, కాజూరు రాజేష్, రాజేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు టిటిడి భృతి

(మొదటి పేజీ తరువాయి) భృతి ఇవ్వాలని మేనిఫెస్టోలో ఉందన్నారు. ఆ మేరకు రాష్ట్రంలో 590 వేద పండితులు రాష్ట్రంలో నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. వారికి రూ.3 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలోని పునర్ నిర్మాణంలో ఉన్న ఆలయాలకు 147 కోట్లు విడుదల కాగా అవి నిలిచిపోయాయని, శ్రీవాణి ట్రస్టు ద్వారా మరో 11 కోట్లు నిధులు మిగతా ఆలయాలకు రావాల్సి ఉందని వీటన్నింటిని చర్చించి నిర్ణయం తీసుకుంటామని టిటిడి బోర్డు అధికారులు తెలియజేశారు. టీటీడీలో అన్యమతస్తులు ఉందేది వాస్తవమేనని కేంద్రమంత్రి బండి సంజయ్ టీటీడీలో పనిచేస్తున్న వేయి మంది అన్యమతస్తులు ఉన్నారన్న దానిపై విచారణ కొనసాగుతుందన్నారు. టీటీడీ కాలేజీ, పాఠశాలల్లో ఉన్న 192 పోస్టులను ఒప్పంద లెక్చరర్ లతో భర్తీ చేసేందుకు చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో టీటీడీ అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి,జేఈవో వీరబ్రహ్మం, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ టీటీడీ మరియు దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చెరువులు కబ్జా

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలంలోని అనేక చెరువులు అంచలు అంచలుగా కబ్జాలకు గురి అవుతున్నాయి. బైరెడ్డిపల్లి మండలంలోని పెద్ద చెరువు కడపనతం చెరువు, లక్కనపల్లి చెరువు, మేకల నాగిరెడ్డిపల్లి చెరువు, ఇలాంటి అనేక చెరువులు ఖబ్జాలకు గురి అవుతున్నాయి. బైరెడ్డిపల్లి పెద్ద చెరువు కమ్మనపల్లి పంచాయతీ భాగానికి 75 ఎకరాలు గంగినేపల్లి పంచాయతీ భాగానికి 75 ఎకరాలు బైరెడ్డిపల్లి పంచాయతీ భాగానికి 62 ఎకరాలు మొత్తం ఇంచుమించు 210 ఎకరాల పైచిలుకు గుండుబావి లాగా నీటితో నిండుగా ఉండాల్సిన ఈ చెరువు కాస్త పడగ విప్పిన నాగుపాము లాగా సన్నగా తయారైనది. చెరువులను ఆ కాలంలో సహజ వనరుగా భావించి పెద్ద తటాకాలుగా తవ్వించి చెరువుల నిర్మాణాలను చేపట్టడం జరిగినది. చెరువులో ఎంత నీరు నిలువ ఉంటే భూమి అంత సారవంతంగానూ నీటి శాతం ఎక్కువగానూ ఉంటుంది. అయితే ఇప్పటి పరిస్థితుల్లో నీరు ఇంకడం లేదు. నీరు భూమిలోనికి ఇంకనట్లయితే బోర్లలో నీరు ఉండదు. రాయలసీమ వంటి వర్షాభావ ప్రాంతంలో బావులు, చెరువులు, బోర్లపైనే ఎక్కువగా రైతులు ఆధారపడి పంటలు పండిస్తుంటారు. కాబట్టి చెరువులలో నీళ్లు నిలువ ఉండడం ఎంతైనా అవసరం. చెరువులను ఆక్రమించి మట్టిని ఎత్తుగాతోసి చదును చేసి పంటలను పండించుకోవడం వలన వర్షాలు పడి నీరు నిలవాల్సిన సమయం వచ్చినప్పుడు ఆ నీరు కాస్త పల్లానికి వెళ్ళిపోతుంది. గత సంవత్సరం మండలంలో విరివిగా వర్షాలు పడి చెరువులు నిండిపోయి మరవను వెల్లడం అందరికీ తెలిసిన విషయమే. గతంలో ఒకసారి చెరువు నిండితే కొన్ని సంవత్సరాల పాటు ఆ చెరువుపై ఆధారపడి బావులన్నీ నిండుగా ఉండేవి రైతులు పంటలు పండించుకునేవారు. ఇప్పుడు చెరువులు నిండినా గాని సంవత్సరం లోపలే ఇంకిపోతున్నాయి. దీనికి ప్రధాన కారణం చెరువులోని ఇసుకను తరలించడం మట్టిని తవ్వేయడం అయితే రెండవది చెరువులు కబ్జాలు చేసి ఆ చెరువుపై మట్టిని తోలి పంటలు పండించుకోవడమే అని రైతులు తెలియజేస్తున్నారు. చెరువులలో షెడ్డులు వేసుకొని విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్లు బిగించుకొని బోర్లు వేసుకొని పంటలను యదేచ్చగా పండిస్తున్నారు. చెరువు కట్ట కింద పంటలను పండించుకోవడం అందరికీ తెలిసిన విషయమే.. అయితే ప్రస్తుతం చెరువులలోనే పంటలు పండించేస్తుండడం వలన దిగువ ప్రాంతాల రైతులకు బోర్లలో నీళ్లు లేక ఇబ్బంది పడాల్సిన అవసరం వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరువు పనులలో భాగంగా చెరువు చుట్టూ కందకాలను తవ్వించడానికి ప్రభుత్వము నుండి పది లక్షల రూపాయలు ఇప్పటికే మంజూరైనట్లు తెలుస్తున్నది. ఈ డబ్బును ఉపయోగించి చెరువు చుట్టూ రెవెన్యూ అధికారులు సర్వే చేయించి హద్దులను గుర్తించి కందకాలను తవ్వించి ఇతరులు చెరువులు ఆక్రమించకుండా చేయవలసినదిగా మండల రైతులు, నాయకులు తెలియజేస్తున్నారు.

కూటమి ప్రభుత్వమే

(మొదటి పేజీ తరువాయి) పరుగులు పెడుతుందని యువతకు ఒక మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీలు అందక ఎంతో నష్టపోయారని కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి రైతుకు సబ్సిడీ ద్వారా డ్రిప్పులు వ్యవసాయ పనిముట్లు మామిడి రైతులకు మద్దతు ద్వారా కల్పించారన్నారు. రైతుల గురించి ఆలోచించే ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. తర్వాత మండల కేంద్రంలో అన్నా క్యాంటీన్ కు భూమి పూజ చేశారు. మండలంలో 33/11 కెవి సబ్స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీమినేని చిట్టిబాబు నాయుడు, కృష్ణమ నాయుడు, శ్రీధర్ యాదవ్, హరీష్ యాదవ్, స్వామిదాస్, దేవ సుందరం, జ్యోతి, యాదవ్, మోహన్ నాయుడు, పుష్పరాజ్, ఎంపిడిఓ కృష్ణమహేష్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొల్లుకు డైరెక్టర్ మునిరత్నం స్వాగతం

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద ఘన స్వాగతం లభించింది. ఆలయానికి వచ్చిన మంత్రిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వన్నెకుల క్షత్రియ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి స్వయంగా స్వాగతం పలికి, దృశ్శాలువతో సన్మానించి, అమ్మవారి ప్రతిమ ఫోటోను బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో మంత్రి రవీంద్రకు పలువురు భక్తులు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వనకుల క్షత్రియ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి, అయ్యంగారి బాలసుబ్రమణ్యం రెడ్డి కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

శివయ్య సేవలో యనమల రామకృష్ణుడు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో వెలసిన వాయులింగేశ్వ రుని శనివారం శాసనసభ మాజీ సభాపతి యనమల రామకృష్ణుడు, ఆయన కుమార్తె, ఎమ్మెల్యే యనమల దివ్య కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, ఆయన సతీమణి బొజ్జల రిషితారెడ్డి వీరికి ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా యనమల రామకృష్ణుడు కుటుంబ సభ్యులు అందరూ ఊరందూరుకు వెళ్లారు. అక్కడ బొజ్జల వెంకటసుధీర్ రెడ్డితో ముచ్చటించారు. దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డితో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబుకు కార్మికుల అభినందన

విశాలాంధ్ర - తిరుపతి : స్థానిక ఆర్. టి. సి. బస్టాండ్ సమీపంలోని.. టీటీడీ కి చెందిన శ్రీనివాసం సముదాయం లో పనిచేసే కార్మికులకు తిరుపతి ఈ. ఎస్. ఐ. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. ఎం. శ్యాంబాబు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి సిబ్బందికి వైద్య సేవలు అందించి, ఈ. ఎస్. ఐ. అందిస్తున్న ప్రయోజనాలుపై అవగాహన కల్పించారని పేర్కొంటూ శనివారం కార్మికుల ప్రతినిధులు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబును సన్మానించి అభినందనలు తెలియచేసారు. శ్రీనివాసం కు చెందిన కార్మికుల ప్రతినిధులు శ్రీనివాసులు రెడ్డి, చెంచు రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు వైస్ ఎంపీపీ సరోజిని మృతి

విశాలాంధ్ర - సత్యవేడు: సత్యవేడు మండలం మదనంబేడు గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ(వైయస్ఆర్పీపీ) సరోజినీ శనివారం ఉదయం మృతి చెందారు.గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై చెన్నై ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. అయితే చికిత్స తీసుకున్న ఫలితం లేకపోవడంతో వైస్ ఎంపీపీ సరోజినీ మృతి చెందడం జరిగింది.వైస్ ఎంపీపీగా సరోజిని బాధ్యతలు స్వీకరించిన తర్వాత సొంత గ్రామం మదనంబేడు అభివృద్ధికి ఎనలేని సేవలు చేశారు.వైస్ ఎంపీపీ సరోజినీ మృతిపై వైయస్ఆర్సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ నూకతోటి రాజేష్,ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి,జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి,సురుటుపల్లి ఆలయ మాజీ చైర్మన్ బాలాజీ రెడ్డి,నిరంజన్ రెడ్డి,బెల్ట్ రమేష్ తదితరులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ సరోజినీ మృతి వైఎస్ఆర్సిపి పార్టీకి తీరని లోటన్నారు.ఈ నేపథ్యంలో రాబర్ట్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పార్టీ పరంగా అన్ని విధాల ఆదుకుంటామన్నారు.కాగా వైస్ ఎంపీపీ సరోజినీ మృతదేహానికి ఆదివారం మదనంబేడు గ్రామంలో దహన సంస్కారాలు జరగనున్నాయి.

అప్పలాయగుంటలో వైభవంగా పుష్పయాగం

విశాలాంధ్ర -తిరుపతి: అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం పుష్పయాగం వైభవంగా జరిగింది. ఈ ఆలయంలో జూన్ 07 నుండి 15వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం విదితమే. నిత్యకైంకర్యాల్లో గానీ, బ్రహ్మోత్సవాల్లో గానీ, అర్చక పరిచారకుల వల్ల, అధికారుల వల్ల, భక్తుల వల్ల ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటిని నివృత్తి చేసుకునేందుకు పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.ఇందులో భాగంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉభయదేవేరులతో కూడిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి స్నపనతిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. ముందుగా పుష్పయాగం కోసం వినియోగించే పుష్పాలను ఆలయంలో మూలమూర్తి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈఈవో శ్రీ హరీంద్రనాథ్, ఏఈవో శ్రీ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీమతి శ్రీవాణి, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

- గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

విశాలాంధ్ర- గూడూరు : ఈనెల 15వ తేదీ గూడూరు పట్టణంలో జరిగే సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర ఆర్అండ్‌బి శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి పాల్గొంటారని కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కోరారు .గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మంత్రి జనార్దన్ రెడ్డి పర్యటనపై చర్చించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ గూడూరు పట్టణంలో జరిగే సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి పాల్గొంటున్నారన్నారు. నాయకులు తమ ప్రాంతాల్లో ఎక్కడైనా రోడ్ల సమస్య ఉంటే తెలియజేస్తే మంత్రికి తెలుపుతామని వెల్లడించారు. నాయకులు కార్యకర్తలు పాల్గొని మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో శీలం కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి పులిమి శ్రీనివాసులు ,వెంకటేశ్వరరాజు ,బిల్లు చెంచురామయ్య, శివకుమార్, జలీల్ ఇతరులు పాల్గొన్నారు.

పూర్వీకులు నివాసం ఉన్న మా స్థలానికి పట్టాలు ఇవ్వాలి

విశాలాంధ్ర- సత్యవేడు: మా పూర్వీకులు నివాసమున స్థలాలకు పట్టాలు ఇవ్వాలని సత్యవేడు మండలం కొత్తమారికుప్పం ఎస్టీ కాలనీ గిరిజనులు కోరారు. శనివారం ఇంటి స్థలాలు లేని గిరిజనులు పలువురు ఎస్టీ కాలనీకి సమీపంలోని స్థలాలను ఆక్ర మించుకొని గుడిసెలు వేసుకున్నారు.ఈ సందర్భంగా గిరిజనులు చిత్ర,కస్తూరి మాట్లాడుతూ తమ గిరిజన కాలనీలో దాదాపు 100 కుటుంబాలు నివసిస్తున్నట్టు పేర్కొన్నారు.అయితే సొంత ఇంటి స్థలం లేని వారు 50 కుటుంబాలు ఉన్నట్టు చెప్పారు.గతంలో ఈ గిరిజన కాలనీకి దక్షిణ భాగాన తమ పూర్వీకులు నివసించే వారన్నారు.అయితే ఈ స్థలాలను కొందరు పెత్తందారులు పట్టాలు తీసుకోవడంతో ఇబ్బందులు ఎదురయిందన్నారు.ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకున్న పెత్తందారులు తమను బెదిరిస్తున్నట్టు ఆరోపించారు.ఈ పంచాయతీలో సుమారు 600 ఎకరాల చుక్కల భూమి ఉన్న గిరిజనులకు మాత్రం స్మశాన వాటిక లేదన్నారు.గతంలో ఈ ప్రాంతాన్ని పర్యటించిన గిరిజన కమిషన్ సభ్యులకు తమ సమస్యను మొరపెట్టుకున్న ఫలితం కనిపించలేదన్నారు.ఇప్పటికైనా దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి ఇంటి స్థలం లేని నిరుపేద గిరిజనులకు పట్టాలు మంజూరు చేసి నీడ కల్పించాలని విన్నవిం చారు.ఈ మేరకు అధికారులు స్పందించాల్సి ఉంది.ఈ కార్యక్రమంలో మారి,శైల, వసంత,అమ్ములు,ఎల్లమ్మ,అనంత,వెంకటలక్ష్మి, పాపమ్మ,మనీ, చెల్లమ్మ, తమిళ్ సెల్వి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - తడ : కాంగ్రెస్ పార్టీ తడ మండల అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలను తడలో ఘనంగా నిర్వహించారు.శనివారం తడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మిత్రులు, శ్రేయోభిలాషులు, తడ, సూళ్లూరుపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు, కార్యక్రమంలో కేక్ కట్ చేసి పలువురు భాస్కర్ రెడ్డిని శాలువాతో సన్మానించ్చారు.ఈ సందర్భంగా తడ మండల ప్రెసిడెంట్ ఆంబాకం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లా ప్రెసిడెంట్ డిసిసి బాలగూరవం బాబు ఆధ్వర్యంలో తామంతా కాంగ్రెస్ పార్టీకి అనునిత్యం, నిరంతరం పనిచేసి రాబోవు ఎన్నికలలో రాష్ట్రంలో, దేశం లోనూ కాంగ్రెస్ పార్టీ విజయానికి పాటుపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో, వైస్ డీసీసీ ప్రెసిడెంట్ తుమ్మ దేవదానం, జిల్లా వైస్ ప్రెసిడెంట్ యన్, మురళి,జిల్లా ఒబిసి ప్రెసిడెంట్ భాస్కర్ యాదవ్, జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ తుమ్మ ప్రేమాకుమార్, జిల్లా యస్, సి సెల్ అధ్యక్షుడు తడబాబు, జిల్లా ఒబిసి వైస్ ప్రెసిడెంట్ నిత్యానంద్, మండల కార్యదర్శి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: మండలంలోని అమ్మపాలెం, చుక్కలు నిడుగల్లు సీపీఐ శాఖ సమావేశం శనివారం టి.మణి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జనమాల గురవయ్య పాల్గొని మాట్లాడుతూ పార్టీ స్థాపించి రెండు 2025 డిసెంబర్ 26 నాటికి వందేళ్లు పూర్తవుతుందన్నారు. ఈ వందేళ్ళ కాలంలో భూమి కోసం భూ సంస్కరణలు చేపట్టాలని, రాజభరణాల రద్దుకై, బ్యాంకుల జాతీయ కరణ, కార్మిక చట్టాల అమలు కొరకు పలు ఉద్యమాలు నిర్వహించి చట్టాలు సీపీఐ ఆధ్వర్యంలో చేసినట్లు తెలి పారు. సమాచార హక్కు చట్టం, ఆహార భద్రత చట్టాన్ని సాధించామన్నారు. తిరుపతి జిల్లాలో అనేక రకాల సమస్యలు పార్టీ అని ఈ దేశంలో రాష్ట్రములో జిల్లాలలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు విద్యార్థి యువ జన మహిళల హక్కుల సాధన కోసం కార్మి కుల ఉద్యోగాల న్యాయమైన కోరికల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న పార్టీ సీపీఐ అని... శతవ సంతాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా జరుగుతున్న తిరుపతి జిల్లా రెండవ మహాసభ లను జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి, బుజ్జమ్మ,పోలయ్య, చెంచయ్య ,భరత్,వెంకటమ్మ,రాజేశ్వరి,శానమ్మ.మునెమ్మ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సతీమణి మృతిపట్ల టీడీపీ నేతల సంతాపం

విశాలాంధ్ర - పుత్తూరు : పుత్తూరు రూరల్ మండలం తిరుమలకుప్పం మాజీ సర్పంచ్ గాలి రామచంద్ర నాయుడు సతీమణి జి.ఆర్. సుబ్బరత్నమ్మ (65)మరణవార్తతో గ్రామం లో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆమె మృతిపట్ల రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, చిత్తూరు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు. సంతాపం.ప్రకటించారు.ఆమె పార్థీవదేహానికి నివాళులు అర్పించిన అనంతరం, ఆమె కుమారుడు ,టీడీపీ సీనియర్ నాయకులు సతీష్ నాయుడు కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా పుత్తూరు రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఏ. బాలాజీ, ఈశ్వర్ ప్రసాద్, రవి నాయుడు, గిరి, మగేష్ తదితర నేతలు కూడా తదితరులు పాల్గొన్నారు.

మిగిలిన సీట్లు భర్తీ కోసం దరఖాస్తు ఆహ్వానం

- బాలుర గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు సత్యనారాయణ

విశాలాంధ్ర-సత్యవేదు: సత్యవేడు మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో వివిధ తరగతుల్లో మిగిలిపోయిన సీట్లు భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు స్థానిక బాలుర గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు సత్యనారాయణ పేర్కొన్నారు.ఈ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5,6,7,8 తరగతులతో పాటు 9వ తరగతిలోనూ మిగిలిపోయిన సీట్లు భర్తీకి సంబంధించి ప్రవేశ పరీక్షల నిమిత్తం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు.స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ ఫోటోను తీసుకొచ్చి దరఖాస్తులను పూరించి సమర్పిస్తే విద్యార్థులకు వెంటనే హాల్ టికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు.జూలై 20వ తేదీన ఉదయం 10:30 నుంచి 12:30 గంటల వరకు స్థానిక బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షల్లో వచ్చే మార్కులు ఆధారంగా మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయడం జరుగుతుందన్నారు.జూలై 12 నుంచి 19వ తేదీ వరకు దరఖాస్తులు కళాశాలలో అందుబాటులో ఉంటుందన్నారు. దరఖాస్తులు సమర్పించుకో వడానికి జూలై 19 తుది గడువు అన్నారు.మరిన్ని వివరాల కోసం ప్రధాన ఆచార్యులు మొబైల్ నెంబర్లు 9912182725,7989369199ను సంప్రదించాలన్నారు.

మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా గౌస్‌బాష

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ గా చంద్రగిరికి చెందిన టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు గౌస్ బాష నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. చంద్రగిరి మార్కెట్ యార్డు పరిధిలో చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాలు ఉన్నాయి. మార్కెట్ యార్డు గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే పులివర్తి నాని, డైరెక్టర్లుగా జెరిపిట్ట వినోద్ కుమార్, భీమవరం కామేశ్వరి, చీకటిపల్లి సిద్దారెడ్డి, దేశిరెడ్డి రమణారెడ్డి, దొమ్మలపాటి శాంతి, జూటూరు అనంతలక్ష్మి, గుంతాటి మురళి, కె.నాగరాజ, పి.మునిగీత, పసుపులేటి శాంతమ్మ, రామిశెట్టి నాగేశ్వరి, కోట వెంకట్రాయులు, మొదాపల్లి మురగేషన్, కె.రాణి, నరసింగాపురం సింగిల్ విండో చైర్మన్ రాజులగారి వినోద్, అగ్రికల్చర్ ఏడీ, చంద్రగిరి సర్పంచ్ రూపారా మ్మూర్తి, అగ్రిట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్లను నియమించారు. ఈసందర్భంగా గౌస్ బాషా మాట్లాడుతూ తనను చంద్రగిరి మార్కెట్ యార్డు చైర్మన్ గా ప్రకటించిన ఎమ్మెల్యే పులివర్తి నాని, డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడులకు గౌస్ బాష కృతజ్ఞతలు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టమోటా వ్యాను - హెరిటేజ్ ఉద్యోగి మృతి

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి మండలం కళ్యాణి ధాం సమీ పంలో ద్విచక్ర వాహనాన్ని టమోట వ్యాన్ ఢీకొనడంతో హెరిటేజ్ పాల సేకరణ విభాగంలో పనిచేస్తున్న సూపర్ వైజర్ మెహబూబ్ భాష (59)అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కొద్ది నెలలలో పదవీ విరమణ చేయబోతున్న బాకరాపేటలో కాపురం ఉంటూ కాశి పెంట్ల హెరిటేజ్ డైరీలో పాల సేకరణ విభాగంలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న మెహబూబ్ భాష తన విధులను ముగించుకొని ద్విచక్ర వాహనంలో కాశిపెంట్ల నుండి స్వగ్రామం బాకరాపేటకు బయలుదేరాడు. మార్గమధ్యమం భాకరాపేట ఘాట్ కళ్యాణి ధాం సమీపంలో భాకరాపేట నుండి తిరుపతి వైపు వస్తున్న టమేటా వ్యాను అతివేగంగా వచ్చి మెహబూబ్ భాష ద్విచక్ర వాహ నాన్ని ఢీకొనగా ద్విచక్ర వాహనం, టమేటా ట్రేలు భాషాపై పడి తీవ్ర గాయాలయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ అనిత సిబ్బందితో సంఘటన స్థలం చేరుకుని సవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి వైద్య కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డైరీలో అందరితో పాటు సౌమ్య వ్యవహరిస్తూ స్వగ్రామంలో కూడా మంచి పేరు తెచ్చుకొన్న భాష మరణం వార్త విని ఇటు సహ ఉద్యోగులు, స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మహబూబ్ బాషా కు భార్య, ఇద్దరు కుమారులు సంతానం. కుటుంబ ప్రధాన సంపాదనాపరుడు చనిపో వడంతో ఆ కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి మెహబూబ్ భాష కుటుంబాన్ని ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

వరసిద్ధిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

విశాలాంధ్ర–పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని తూనీ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రభుత్వ యనమల దివ్య స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేసి స్వామి తీర్థప్రసాదాలు శేష వస్త్రం చిత్రపటాన్ని ఆలయ ఈవో పెంచల కిషోర్ అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండపాణి, వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో తొలి అడుగు

విశాలాంధ్ర–గంగవరం: సుపరిపాలలో తొలి అడుగు కార్యక్రమాన్ని కీలపల్లి, పత్తికొండ పంచాయతీ గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బి.సోమశేఖర్ గౌడ్ యూనిట్ ఇంచార్జి వి.దేవేందర్ రెడ్డి పంచాయతీ అధ్యక్షులు పి.రంగప్ప నాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సీనియర్ నాయకులు హరిబాబు ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప బూత్ కమిటీ కన్వీనర్ పార్వతీష్ పంచాయతీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

భీమ్‌రావు యశ్వంత్ అంబేద్కర్‌కి ఘనసత్కారం

బాబాసాహెబ్ మునిమనవడు పుత్తూరులోకి తొలి అడుగు

విశాలాంధ్ర–పుత్తూరు: పుత్తూరు పట్టణం, కార్వేటినగరం రోడ్డు కూడలిలో, బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించిన ఆయన ముని మనవడు డా. భీమ్‌రావు యశ్వంత్ శనివారం పుత్తూరు అంబేద్కర్ విగ్రహానికి గజమాల వేసి, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగం వల్లే అందరికీ హక్కులు లభించాయని, దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు భద్రత లేదని విమర్శించారు. ఈ ప్రాంతానికి రావడం ఇదే మొదటిసారి అని పేర్కొన్న ఆయన, అందరూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దళిత సంఘాల సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ సుబ్రహ్మణ్యం, అంబేద్కర్ ట్రస్ట్ కార్యదర్శి అపరంజి, కోశాధికారి కుప్పయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్, టీచర్ వేణు, మున్సిపల్ మాజీ చైర్మన్ అంకయ్య, గ్యాస్ రవి, మామిల్లయ్య, అడ్వకేట్ రమేష్, బీఎస్పీ నాయకుడు నాగూర్, జైభీమ్ సేన సభ్యులు రామచంద్రయ్య, రవి, ప్రసాద్ డి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌లు పెంచండి: మంత్రికి ఎమ్మెల్యే వినతి

విశాలాంధ్ర–తిరుపతి: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తిరుపతిలో నూతనంగా పది విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం ఉదయం కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా తిరుపతికి వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వినతి పత్రం ఇచ్చారు. జనభా పెరుగుదలతో విద్యుత్ వినయోగం పెరిగిందని భవిష్యత్ అవసరాల దృష్ట్యా విద్యుత్ సరఫరా మెరుగుదలకు 33/11 కేవి సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఆ వినతి పత్రంలో ఎమ్మెల్యే కోరారు. మహిళా యూనివర్సిటీ, ఆర్సీ రోడ్డు, కొరమేణుగుంట, తుడా టవర్స్ వద్ద తక్షిణం సబ్ స్టేషన్లు ఏర్పాటుకు మంత్రి అంగీకరించారు. అలాగే బైరాగిపట్టెడ, జీవకోన, రామచంద్రపుష్కరిణి, శెట్టిపల్లి, కపిలతీర్థం, అర్బన్ తహశిల్దార్ కార్యాలయ సమీపంలో కూడా సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరగా త్వరలోనే వీటి నిర్మాణానికి ఏపిఈఆర్సీ అనుమతి ఇస్తుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు మంత్రి స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీ అధికారి ప్రతినిధిగా పూతలపట్టు ప్రభాకర్

విశాలాంధ్రు–పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం పూతలపట్టు ప్రభాకర్ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా నియామకం. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వైయస్ షర్మిల రెడ్డి, ఏఐసీసీ ఆంధ్రప్రదేశ్ కమిటీ ఇన్చార్జి మనీ ఠాగూర్, కాంగ్రెస్ కమిటీ పూతలపట్టు అధికార ప్రతినిధిగా మన ప్రాంతానికి చెందిన పూతల పుట్ట ప్రభాకర్ నియమించడం జరిగినది. ఈ పదవి రావడానికి కాంగ్రెస్ కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కాంగ్రెస్ పార్టీని గడపగడపకు తీసుకొనిపోతుకాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ నాయకులను నేటి యువతరాన్ని ఆహ్వానిస్తూ కష్టపడినందుకు ఈరోజు పూతలపట్టు ప్రభాకర్‌ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కమిటీ అధికార ప్రతినిధిగా నియమించడం ప్రజలంతా కూడా హర్షిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ పెద్దలైనటువంటి జింగా గౌతం, మరియు డాక్టర్ చింతామోన, పోటుగారు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, మరియు పెద్దలు పాల్గొన్నారు. పూతలపట ప్రభాకర్ మాట్లాడుతూ నాకు ఇచ్చిన బాధ్యతలను నేను శిరస్సు వంచి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను పార్టీ బలోపేతం చేయడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి సమస్యలపై పోరాటం చేస్తానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

స్క్రీన్ అకాడమీన ప్రారంభం

విశాలాంధ్ర–తిరుపతి: భారతీయ సినిమాలో కొత్త ప్రతిభను ప్రోత్సహించటమే లక్ష్యంగా మార్గదర్శక లాభాపేక్షలేని స్క్రీన్ అకాడమీని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ స్క్రీన్ ప్రారంభించినట్లు లోధా ఫౌండేషన్ వ్యవస్థాపక పోసికుడు అభిషేక్ లోదా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్స్, ఆస్కార్ విజేతలు, గునీత్ మోంగా, పాయల్ కపాడియా, రెసుల్ పూకుట్టి, ప్రముఖ స్క్రీన్ రైటర్ అంజుమ్ రాజబలి వంటి వారు మార్గదర్శకులుగా తమ సేవలను అందిస్తున్న ఈ అకాడమీ, భారతదేశంలోని అగ్రశ్రేణి చలనచిత్ర సంస్థలతో కలిసి పనిచేస్తుందన్నారు. చలనచిత్ర పాఠశాలలు నామినేట్ చేసిన విద్యార్థులకు ఏటా పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫెలోషిప్‌లను అందిస్తుందన్నారు. దరఖాస్తు ప్రక్రియ వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ .స్క్రీంఅకాడమీ.ఆర్గనైజషన్ ని సంప్రదించాలని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ గోయెంకా తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల సహకారంతో పురాతన బావి పరిశుభ్రం

విశాలాంధ్ర–చౌడేపల్లి: కొత్త వీరప్పల్లి సమీపంలో పురాతనమైన కొన్ని తరాలపాటు నిరుపయోగంగా ఉన్న నాయన బావిని గ్రామస్తుడు శంకర్ రాజు చొరవతో గ్రామంలోని ప్రతి ఒక్కరూ శ్రమదానం చేసి కోనేరు లాంటి నాయని బావిని పరిశుభ్రం చేశారు. గ్రామంలో మరణించిన తర్వాత శుభస్వీకరణ కార్యక్రమాలు ఆ నాయన బావి దగ్గరే చేయడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు అంటున్నారు. ఈనెల 17వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు వైకుంఠ సమారాధన జరుగుతుందని, గ్రామస్తులు, బంధుమిత్రులు తరలి రావాలని కొత్త వీరప్పల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

30 సవర్లు బంగారు చోరీ...

విశాలాంధ్ర–గూడూరు: స్థానిక గమళ్లపాళెం ప్రాంతంలో నివాసముంటున్న శివయ్య అనే వ్యక్తి స్థానిక నివ మార్కెట్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆగస్టు నెలలో తన కుమార్తె వివాహం ఉండడంతో 30 సవర్ల బంగారు ఆభరణాలను ఇంట్లో భద్రపరిచివున్నాడు. శనివారం వేకువన 3గంటల సమయంలో శివయ్య కుటుంబసభ్యులు పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. అదే సమయంలో అతని కుమారుడు చైతన్య ఇంట్లోనే నిద్రిస్తున్నాడు. ఇదే సమయంలో కొందరు గ ర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోనికి ప్రవేశించి బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 30 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకు వెళ్లారు. ఉదయం చైతన్య నిద్రలేచి చూసే సమయానికి చోరీ జరిగినట్లు చోరీ జరిగినట్లు గుర్తించడంతో ఒకటో పట్టణ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటనా స్థలాన్ని డీఎస్పీ గీతాకుమారి పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం

విశాలాంధ్ర–శ్రీకాళహస్తి: ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ నాయకులు అన్నారు. అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీరారెడ్డి ఆదేశాలతో పట్టణాధ్యక్షుడు విజయకుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కంఠా రమేష్ సూచనలతో శనివారం 34వ వార్డు బూత్ నెంబర్ 103లో ఇంటింకి వెళ్లిప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 204 అన్నాక్యాంటీన్ల ద్వారా రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తున్నారన్నారు. రైతుకునిగంటలు ఉచిత విద్యుత్, చేనేతల పవర్ లూమ్స్కు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్స్కు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, దీపం పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికి ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అందజేస్తున్నట్లు తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంతమంది ఉన్నా వారందరికి రూ.15వేలు చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. పింఛన్ల పెంపు వంటి వాటిపై వివరించారు. మెగా డీఎస్సీ ద్వారా 16347 ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నటు వివరించారు. డీపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి శివరెడ్డి, మునిరాజా, కాళ్లపరెడ్డి, భాస్కర్, మహేష్, జగన్, వెంకటేష్, బాలాజీ, వెంకటేష్, సాయి, కృష్ణ, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో తాండవిస్తున్న అపరిశుభ్రత

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలానికి సంబంధించిన అనేక పంచాయతీలలో అపరిశుభ్రత తాండవిస్తున్నది. ఈ గ్రామాలలో డ్రైనేజీ సౌకర్యాలు లేవు. నీళ్లు వెళ్ళడానికి అనుకూలమైన పరిస్థితిని సంబంధిత అధికారులు కల్పించలేదు 21 పంచాయతీలలోనూ అపరిశుభ్రత వలన అనేకమంది రోగాలకు గురి అవుతున్నారు ఎవరైనా అధికారులు వస్తే తప్ప ఆయా ప్రదేశాలలో తెల్ల సున్నం చల్లుతారని డిడిటి పౌడర్ కూడా చల్లరు. ప్రత్యేకంగా నెల్లిపట్ల పంచాయతీ దాసర్లపల్లి గ్రామ పంచాయతీ కమ్మనపల్లి పంచాయతీ దేవ దొడ్డి పంచాయతీ ధర్మపురి పంచాయతీ కడపనతం పంచాయతీ లక్కనపల్లి పంచాయ తీలలో అపరిశుభ్రతతో ప్రజలు నానా ఇబ్బందులు పడు తున్నారు. ఆరోగ్య సిబ్బంది గానీ పంచాయతీ సిబ్బంది గాని నామమాత్రంగా వ్యవహరిస్తున్నారు గాని నిజమైన సేవలు చేయలేకపోతున్నారని ప్రజలు వాపోతున్నారు. డ్రైనేజీ సౌకర్యం కల్పించవలసినదిగా అనేకమార్లు పంచాయతీ సెక్రటరీలను వేడుకున్నాగాని ప్రయోజనం లేకపోయింది. ఈ మండలంలో అనేక పంచాయతీల లో డ్రైనేజీ సౌకర్యం కల్పించినట్లు బిల్లులు పెట్టుకుని నగదు తీసుకున్నట్లు లెక్కలు చూపిస్తు న్నాయి. ఎక్కడ కూడా డ్రైనేజీ సౌకర్యం కల్పించినట్లు కనపడలేదు ఇప్పటికైనా సంబంధిత అధికారులు పంచాయతీలలో క్షేత్రస్థాయి పర్యటన చేసి డ్రైనేజీ సౌకర్యాన్ని సరిదిద్ది ప్రజలను రోగాల బారిన పడకుండా కాపాడాలని పలువురు తెలియజేస్తున్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని ఓంశ్రీ సాయిరాం వృద్ధాశ్రమం నందు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతలుగా మెడనూరు సురేష్ రెడ్డి, శాంతి దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయమన్నారు. దాతల సహకారం మరువలేనిదన్నారు. ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, బండి ధనుంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి

విశాలాంధ్ర-కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి చెందు తుందని మండల టిడిపి ఉపాధ్యక్షులు నగరం సోమశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లా డుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరుస్తు ఉన్నారన్నారు. దేశం లోనే ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా వృద్ధులకు 4000 రూపాయలు పెన్షన్, వికలాంగులకు 6000 రూపాయలు, మంచం మీద ఉన్న రోగులకు 15000 రూపాయలు చొప్పున అందిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా పేదలకు గ్యాస్, తల్లికి వందనం, త్వరలో మహిళలకు ఫ్రీ బస్సు పథకం అమలు చేయ నున్నట్లు పేర్కొన్నారు, తెలుగుదేశం ప్రభుత్వం అంటేనే ఎస్సీ ఎస్టీ బడుగు వర్గాల అండ ఎప్పుడు ఉంటుందన్నారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో సుపరి పాలన జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా పోలవరం, అమరావతి లో రాజధాని పనులు పరుగులు తీస్తున్నాయి అన్నారు. పేద ప్రజలంతా సంతోషంగా టిడిపి ప్రభుత్వంలో ఉన్నారన్నారు. రానున్న నాలుగు సంవత్సరాలలో రాష్ట్రం ఎంతో పురభివృద్ధి చెందుతుందని వివరించారు.

శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి మహిమలు అమోఘం



విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలం తీర్థం గ్రామపంచాయతీ కేంద్రంలో నెలకొని ఉన్న శ్రీరాముల వారి గుడి విశిష్టత ఎంతో గొప్పదని మహిమలు కలిగిన ఈ గుడిని అనేకమంది భక్తులు దర్శించుకుంటు న్నారు. ప్రతి శుక్రవారం ఈ గుడిలో పూజలు అర్చనలు అనాదికాలం నుండి జరుగు తున్నది శ్రీరామ నవమి సందర్భంలో పది రోజుల వరకు ఈ గుడిలో పూజలు వ్రతాలు నోములు చేస్తుంటారు మొక్కులు కోరుకొని తీరిన వారు మొక్కలు చెల్లించుకుంటూ ఉంటారు. భక్తిశ్రద్ధలతో నవగ్రహాలను చుట్టి భగవంతుని ప్రార్థిస్తుంటారు. పూజలు అర్చనలను నిర్విఘ్నంగా సాగిస్తున్న రాజేష్ స్వామి వారి కుటుంబ సభ్యులు ఈ గుడికి ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు మహిమ కలిగినటువంటి ఈ దేవాలయాన్ని ప్రతి ఒక్కరూ దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని గుడి కార్యనిర్వాహక సభ్యులు తెలియజేస్తున్నది.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం: డాక్టర్ మురళీధర్ రెడ్డి

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం ఇది వారి శారీరిక మానసిక సామాజిక ఆరోగ్యానికి చాలా ముఖ్యం అంటూ ప్రాథమిక వైద్య అధికారి మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు మురళీధర్ రెడ్డి, డాక్టర్ ఉదయ్ కుమార్ లు బాలికలు కు వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం భోజన సమయానికి భోజనాన్ని పసహపంక్తి భోజనం చేశారు. అనంతరం వారు బాలికలతో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వల్ల ఇన్ఫెక్షన్లు మరియు వ్యాధులు రాకుండా నివారించవచ్చు. ముఖ్యంగా, ఋతుక్రమం సమయంలో పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యం, ఎందుకంటే ఇది ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుందన్నారు. ఆహారం తినడానికి ముందు మరియు తర్వాత, టాయిలెట్ ఉపయోగించిన తర్వాత, బయటి నుండి వచ్చిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ప్రతిరోజూ స్నానం చేయడం చాలా ముఖ్యం, ముఖ్యంగా యుక్తవయస్సులో, శరీరంలో మార్పులు చోటుచేసుకుంటాయి కాబట్టి ఋతు పరిశుభ్రత చాలా అవసరం, ఋతుక్రమం సమయంలో, పరిశుభ్రమైన ప్యాడ్ లను ఉపయోగించాలి మరియు వాటిని తరచుగా మార్చుకోవాలన్నారు. బాలికల బాల్య వివాహాల గురించి జరిగే అనర్థాలు గురించి క్లుప్తంగా వివరించారు. ఆరోగ్య అధికారి డిఎస్ వెంకటేశులు, వసతి గృహ సంక్షేమ అధికారి సుభాషిని, విద్యార్థులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి కృతజ్ఞతలు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన చంద్రగిరి నియోజక వర్గం నేతలు తమకు సిఫార్సు చేసిన పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు పదవులు రావడానికి సిఫార్సు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు సామాన్య కార్యకర్తగా పనిచేసిన తమకు జిల్లా పార్టీలో అవకాశం కల్పించినందున బాధ్యతతో పనిచేస్తామన్నారు. పల్లెల్లో పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించి పనిచేస్తామన్నారు. పార్టీ కార్యక్రమాలను జనంలోకి తీసుకువెళ్లి ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలను ఎండగట్టడానికి సిద్దంగా వున్నామని చెప్పారు. అనంతరం చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షంలో బాగా పనిచేసినపుడే నాయకత్వ లక్షణాలు బయటపడతాయని, భవిష్యత్తులో రాజకీయంగా ఎదగడానికి అవకాశం కలుగుతుందన్నారు. జగనన్న సైనికులుగా పనిచేసే అవకాశం కలిగినందుకు అందరూ గర్వించాలని, కూటమి పార్టీలన్నీ జతకట్టినా సరే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ఏమీ చేయలేరన్న విషయం ప్రజలకు తెలిసేలా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్, ఎర్రావారి పాళెం మండలాల పార్టీ నేతలు పాల్గొన్నారు.

250 సెల్ ఫోన్లు రికవరీ

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లా వ్యాప్తంగా చోరీకి గురైన 50 లక్షల విలువచేసే 250సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేసినట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ తెలిపారు. చాట్ బాట్ బృందం ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను మన రాష్ట్రంలో నే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర, వంటి రాష్ట్రాల నుండి మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్పీ తెలిపారు. సెల్ఫోన్ చోరీకి గురైతే 9440900004 నెంబర్ కు మెసేజ్ చేయాలని తెలిపారు. చాట్ బాట్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టాటా 4 చక్రాల మినీ ట్రక్ ఎస్ ప్రో ఆవిష్కరణ

విశాలాంధ్ర-తిరుపతి: టాటా మోటార్స్ ఆదివారంలో రూపొందించబడిన అత్యంత సరసమైన 4-చక్రాల మినీ-ట్రక్ ఏస్ ప్రోను ఆ సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టాటా మోటార్స్ సరికొత్త టాటా ఏస్ ప్రోను ప్రారంభించడం ద్వారా కార్గో మొబిలిటీలో కొత్త మైలురాయిని సృష్టిస్తూ, చిన్న కార్గో మొబిలిటీలో పరివర్తన యుగానికి నాంది పలికిందన్నారు. కేవలం రూ.3.99 లక్షల సాటిలేని ప్రారంభ ధరతో, టాటా ఏస్ ప్రో భారతదేశంలో అత్యంత సరసమైన నాలుగు చక్రాల మినీ ట్రక్. ఇది అసాధారణ సామర్థ్యం, సాటిలేని బహుముఖ ప్రజ్ఞ, ఉన్నతమైన విలువను అందిస్తుంది. కొత్త తరం వ్యవస్థాపకులకు సాధికారత కల్పించడానికి రూపొందించబడిన టాటా ఏస్ ప్రో పెట్రోల్, రెండు రకాల ఇంధనం (సిఎన్జి పెట్రోల్), ఎలక్ట్రిక్ వేరియంట్లలో లభిస్తుంది - ఇది వినియోగదారులకు వారి వ్యాపార అవసరాలకు అనువైన ఉత్పాదనను ఎంచుకునే సౌలభ్యాన్ని అందిస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న టాటా మోటార్స్ 1250 వాణిజ్య వాహనాల అమ్మకాల టచ్‌పాయింట్లలో, టాటా మోటార్స్ ఆన్‌లైన్ అమ్మ కాల ప్లాట్‌ఫామ్ అయిన ఫ్లీట్ వెర్స్‌లో కస్టమర్లు తమకు నచ్చిన ఏస్ ప్రో వేరియంట్‌ను బుక్ చేసుకోవచ్చు అన్నారు. టాటా ఏస్ ప్రో యాజమాన్యాన్ని సౌకర్యవంతంగా చేయడానికి, టాటా మోటార్స్ ప్రముఖ బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలతో కలిసి పనిచేసి, త్వరిత రుణ ఆమోదాలు, సౌకర్యవంతమైన ఈఎంఐ ఎంపికలు, మెరుగైన నిధుల మద్దతుతో సహా విభిన్న కస్టమర్ అవసరాలకు అనుగుణం గా తిరుగులేని ఫైనాన్సింగ్ పరిష్కారాలను అందిస్తోంది. దీనిని వినియోధాలు సద్విని చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరీష్ వాఘ్, బిజినెస్ హెడ్ పినాకి హల్దార్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సతీమణి మరణం పట్ల మాజీ ఎమ్మెల్సీ సంతాపం

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు రూరల్ మండలం తిరుమల కుప్పం మాజీ సర్పంచ్ గాలి రామ చంద్ర నాయుడు సతీమణి జి.ఆర్. సుబ్బరత్నమ్మ మరణం పట్ల సంతాపం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్సీ గాలి సరస్వతమ్మ ఆమె పార్థివదేహానికి నివాళులర్పించిన అనంతరం వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

మామిడి చెట్లను నరికివేయడంపై లైన్మెన్‌పై రైతు ఆగ్రహం

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటి నగరం మండలం డిఎం పురం పంచాయతీ సుబ్రహ్మణ్యం అనే రైతు పొలంలో దాదాపుగా 30 మామిడి చెట్లను స్థానిక లైన్మెన్ ఎటువంటి సమాచారం లేకుండా కొమ్మలను విచ్చలవిడిగా నరికి వేసినట్లు రైతు పేర్కొన్నారు. ఈ విషయమై రైతులు శనివారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్లో డిఎం పురం లైన్మెన్ పై ఫిర్యాదు చేశారు. అసలే మామిడి పంట సరైన కొనుగోలు లేకుండా రైతులు ఆవేదన చెందుతుంటే విద్యుత్ అధికారులు తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అశ్రునయనాలతో రాజమ్మకు అంతిమ వీడ్కోలు

విశాలాంధ్ర-తిరుపతి: సిపిఎం పార్టీ సీనియర్ నేత, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాతృమూర్తి కందారపు రాజమ్మకు అశ్రునయనాలతో కుటుంబసభ్యులు శనివారం సాయంత్రం అంతిమ వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి లోని సిమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందిన రాజమ్మ భౌతికకాయాన్ని సుందరయ్య నగర్ లోని వారి స్వగృహంలో సందర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా పూతలపట్టు ఎమ్మెల్యే కె మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి, చంద్రగిరి వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, టిటిడి పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ, సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు,సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ, రిపబ్లిక్ ఎన్ పార్టీ దక్షిణాది రాష్ట్రాల ఇన్చార్జ్ అంజయ్య, తెలుగుదేశం పార్టీ నేత మబ్బు దేవ నారాయణ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, 'మేనేజర్' సిఎస్ ప్రసాద్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ మధు , వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు.. రాజమ్మ భౌతిక కాయానికి ఘనంగా నివాళులర్పించారు.

అక్రమానికి గురైన స్మశానం..

సమస్యను పరిష్కారించిన తహసీల్దార్ - ఎంఆర్పిఎస్ నేతలు



విశాలాంధ్ర-చిత్తూరు: మండల పరిధిలోని 89 పెద్దూరు గ్రామ పంచాయతీకి చెందిన దళితులకు సంభందించిన స్మశానవాటిక ఆక్రమణకు గురైందన గతంలో మండల తహసీ ల్దారు కు ఎంఆర్పిఎస్ నేతలు వెంకటేష్ తదితరులు ఫిర్యాదు చేశామని ఎంఆర్పిఎస్ నేతలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం తహశీల్దార్ మరియు రెవెన్యూ సిబ్బంది పెద్దూరు గ్రామానికి చేరుకుని విచారణ జరిపారని శ్మశాన వాటిక సర్వే నంబరు 430/3 లో గల 0.04 సెంట్ల భూమి ఆక్రమణ కు గురైంద గుర్తించారని తెలిపారు అనంతరం ఆక్రమణ కు గురైన భూమి ని శ్మశానభూమి గా గుర్తించి అక్రమనకు గురైన భూమిని దళితులకు స్వాధీనం పరచడంతో తహసీల్దార్ కు కృతజ్ఞతలు తెలియజేశారు కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి: ఎమ్మెల్యే నాని

విశాలాంధ్ర-పాకాల: ఆగస్టు నెలలో నిర్వహించనున్న ఆడికృతిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని పేర్కొన్నారు. శనివారం పాకాల మండలం ఊట్ల వారి పల్లి సమీపం లోని ఆనందగిరి పై వెలసియున్న వల్లి సమేత సుబ్రమణ్య స్వామి ఆలయం ఆవరణలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రభుత్వ అధికారులు, ఉభయదారులుతో బ్రహ్మోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై ఎమ్మెల్యే పులివర్తి నాని సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు నెల 13వ తేదీ నుండి 18 వరకు ఐదు రోజులు పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి అందరి సహకారం ముఖ్యమని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చే భక్తులకు త్రాగునీరు, అన్నదాన కార్యక్రమాలు, దర్శన ఏర్పాట్లను లోటు లేకుండా చూడాలన్నారు. పార్టీలకు అతీతంగా బ్రహ్మోత్సవాలకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఆడికృతిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు చేపట్టే చర్యలు గురించి అధికారులతో చర్చించారు. వచ్చే భక్తులకు తాగునీరు, అన్నప్రసాదం సౌకర్యం కల్పించాలనీ, ఆలయం పరిసరాల చుట్టూ పరిశుభ్రత పాటించాలని, ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, పోలీసు యంత్రాంగం ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు చోటుచేసుకుపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, ఆలయ ఈవో యువరాణి, డిఎల్‌పిఓ సురేష్ నాయుడు, ఎంపీడీవో శశిరేఖ, ఇన్చార్జి తహసిల్దార్ సంతోష్ సాయి, ఇతర శాఖలకు చెందిన అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

కార్యకర్తలను సమన్వయ పరుస్తా

నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గం లో గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా కార్యకర్తల సమన్వయపరచుకుంటూ నియోజక వర్గం లో తన వంతు కృషి చేస్తానని ప్రోగ్రాం కో.ఆర్డినేటర్ కూరుపాటి శంకర్ రెడ్డి పేర్కొన్నారు మండలంలో శనివారం టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మావిళ్ళపల్లి సుధాకర్ నాయుడు అధ్యక్షతన నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి కూటమి నాయకుల పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన శంకర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, బిజెపి నాయకుల సారధ్యంలో ప్రభుత్వం సుపరిపాలనలో కొనసాగుతున్నది. సూపర్ సిక్స్ అమలు పరచడంలో వెనకడుగు వేయకుండా ముఖ్యమంత్రి అహర్నిశలు తల్లికి వందనముతో ముందడుగు వేశారు. ఉచిత గ్యాస్, విద్యార్థులకు అందించవలసిన విద్యాసామగ్రి, సమృద్ధిగా అమలుపరిచారన్నారు. దేశం పార్టీ పేదల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించే విధంగా పరిపాలన కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం నాయకులు తుమ్మల కన్నయ్య నాయుడు,ఎస్ మునెయ్య నాయుడు. సముద్రాల రవి నాయుడు, భాస్కర్ యాదవ్, సముద్రాలు గోపీనాయుడు, సత్యవేడు నియోజకవర్గ నాయి బ్రాహ్మణ అధ్యక్షుడు ఏడాం వెంకటాచలం, మధు నాయుడు,మండలం కమిటీలు, క్లస్టర్ఇంచార్జు యూనిట్ ఇంచార్జు,గ్రామ కమటి అధ్యక్షుడు, బూత్ఇంచార్జీలు, పార్టీ సర్పంచ్లు, మహిళలు, యువత, నాయకులు కార్యకర్తలు మరియు కూటమి నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

రూ. 30 లక్షలు అప్పుగా తీసుకుని

15 మంది వృద్ధులను మోసం చేసిన మహిళ

- లబోదిబోమంటున్న 15 మంది వృద్ధులు
- ఆర్‌సి పురం పోలీసులకు బాధిత వృద్ధులు ఫిర్యాదు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: కూలీ నాలి, కాయ కష్టం చేసి, ఎన్టీఆర్ భరోసా పింఛన్ డబులు పోగు చేసుకున్న 15 మంది వృద్ధుల నుంచి వడ్డీకి అప్పుగా రూ.35 లక్షలు తీసుకున్న మహిళ అప్పు తిరిగి చెల్లించలేనని చేతులెత్తేసి మోసం చేయడంతో వృద్ధులు లబోదిబోమంటూ, బోరుమని విలపించి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన రామచంద్ర పురం మండలం గంగిరెడ్డి పల్లి గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. గంగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన కె.వెంకట ముని భార్య కె.లక్ష్మి గ్రామంలోని వృద్ధులను ఎంచుకొని వారు పోగు చేసి పెట్టుకుని ఉన్న డబ్బులను అధిక వడ్డీ ఇస్తానని నమ్మబలికి 15 మంది వృద్ధుల నుండి రూ. 35 లక్షల రూపాయలను అప్పుగా తీసుకుంది. మొదట ఇద్దరు ముగ్గురు వృద్ధుల నుండి అప్పు తీసుకొని వారికి వడ్డీలు సక్రంగా చెల్లిస్తూ నమ్మించింది. దీంతో మరి కొంతమంది వృద్ధులు కూడా కె. లక్ష్మికి అప్పుగా ఇచ్చారు. రాను రాను అప్పు ఇచ్చిన వారు ఎక్కువమంది కావడం, అప్పు మొత్తం కూడా పెరగడంతో వడ్డీలు చెల్లించలేక లక్ష్మి ఇబ్బందులు పడుతున్న సందర్భంలో గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి భార్య దేశమ్మ దగ్గర మా బంధువుల ఇంటి వద్దకు వెళ్లి రావాలని బంగారు నక్లీసు, బంగారు గాజులు తీసుకుంది. ఆ బంగారును ఇవ్వమని అడగగా రామచంద్రాపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో కుదవ పెట్టానని, త్వరలో డబ్బులు కట్టి విసిపెట్టి ఇప్పిస్తానని చెప్పింది. రెండేళ్లు అవుతున్న బంగారు నగలు విసిపెట్టి ఇవ్వలేదు.... అప్పుగా తీసుకున్న డబ్బులు, వడ్డీలు చెల్లించకపోవడంతో సుబ్రహ్మణ్య రెడ్డి ఆమెను గట్టిగా నెల క్రితం నిలదీయడంతో నన్ను అప్పు చెల్లించమని వేధిస్తున్నారని ఆర్ సి పురం పోలీసులకు లక్ష్మి సుబ్రమణ్యం రెడ్డి పై ఫిర్యాదు చేసింది. దీంతో అప్పులు ఇచ్చిన మిగిలిన వృద్ధులు కూడా మా డబ్బులు మాకు ఇవ్వు అని గట్టిగా ఒత్తిడి చేయడంతో నేను మీ దగ్గర అప్పుగా తీసుకున్న డబ్బులు ఇవ్వలేను, మీకు దిక్కున చోట చెప్పుకోండంటూ ఎదురు తిరగడంతో గ్రామానికి చెందిన ఆ 15 మంది వృద్ధులు కష్టపడి సంపాదించిన డబ్బులు, వృద్ధాప్యంలో ప్రభుత్వం ఇచ్చిన వృద్ధాప్య పింఛను డబ్బులు పోగు చేసుకుంటే... వడ్డీ ఇస్తానని నమ్మించి అప్పు తీసుకుని లక్ష్మి మోసం చేసిందని ఆవేదనతో.. తిండి తిప్పలు తినకుండా బోరుమని చేర్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ 15 మంది వృద్ధులు శనివారం ఎస్సై రవీంద్ర నాథ్ కు తమ వద్దనున్న ఆధారాలతో ఫిర్యాదు చేసి, మా డబ్బులు మాకు ఇప్పించి న్యాయం చేయండి సార్ అంటూ వేడుకున్నారు. దీంతో ఆర్ సి పురం పోలీసులు లక్ష్మిని పోలీస్ స్టేషన్కు పిలిపించి వృద్ధులు దగ్గర తీసుకున్న డబ్బులు ఎప్పుడు ఇస్తావు అని అడగగా నేను ఇవ్వలేను నావల్ల కాదు.... నన్ను వేధిస్తే ఆత్మహత్య చేసుకుంటానని వృద్ధుల ముందే పోలీసులను బెదిరించింది. దీంతో పోలీసులు ఏమి చేయలేక వృద్ధులకు నచ్చ చెప్పారు. వృద్ధులు పోలీస్ స్టేషన్ నుండి వేడ్చుకుంటూ ఇంటిదారి పట్టారు. వృద్ధుల నుండి అప్పు తీసుకున్న లక్ష్మి పుత్తూరు కోర్టులో ఐపి దాఖలు చేసినట్లు సమాచారం.

తిరుమలలో టీటీడీ ఈవో విస్తృత తనిఖీలు

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరితో శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలలోని సీఆర్వో కార్యాలయాన్ని ఆధునీకరించేందుకు చేపట్టిన ప్రణాళికలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. భవిష్యత్తులో యాత్రికుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా అధునాతన సౌకర్యాలతో సీఆర్వోను ఆధునీకరించేందుకు ఉన్న అవకాశాలను అధికారులతో ఆరా తీశారు. అదేవిధంగా నూతనంగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం-5 భవనాన్ని పరిశీలించి వెయిటింగ్ హాళ్ళు, శుభ్రత, భద్రత ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ తనిఖీల్లో టీటీడీ చీఫ్ ఇంజనీర్ సత్య నారాయణ, ఈఈ వేణు గోపాల్, డీఈ చంద్ర శేఖర్, డిప్యూటీ ఈవోలు భాస్కర్, సోమన్నారాయణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రాముడు, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ రంగు పులమొద్దు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీనివాసులు అలియాస్ రాయుడు మృతికి రాజకీయ రంగు పులమవద్దని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పీఆర్ అతిథిగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినుత వ్యక్తిగత కార్యదర్శి రాయుడు మృతి బాధాకరమన్నారు. ఇది పూర్తిగా వ్యక్తిగత విభేదాలతో జరిగిందన్నారు. దీనిని రాజకీయం చేయడం సరికాదని తెలిపారు. శ్రీనివాసులు కుటుంబానికి ఆయన సానుభూతిని తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

విశాలాంధ్ర- గూడూరు: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర భివృద్ధి అని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గూడూరు మండల పరిధిలోని కొమ్మనేటూరు, నేర్నూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం టీడీపీ తోనే సాధ్యమన్నారు. టీడీపీ హయాంలో తప్ప, ఏ ప్రభుత్వ హయాంలో జరగలేదు అన్నారు. అనంతరం ఉచిత గ్యాస్, తల్లికి వందనం, పెన్షన్ పథకాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మట్టం శ్రావణి రెడ్డి, చిన్న వై.ఎస్.ఆర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం పరిధిలో అనారోగ్యం భారినపడి చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ శనివారం లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. చిత్తూరు లక్ష్మీ నగర్ కాలనీలో గల పూతలపట్టు ఎమ్మెల్యే కార్యాలయంలో పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన పలు మండలాలకు చెందిన ఏడు మంది లబ్ధిదారుల్లో దారులకు భాను ప్రసాద్ రెడ్డికి రూ.3,12,790 జి.జయమ్మకి 37, 887 రూపాయలు లోకనాథ్ రెడ్డికి 80,00,034 రూపాయలు ఎన్ సురేష్ కుమార్ కి 26 వేల రూపాయలు వి.గురు స్వామికి 55,234 జ్యోతి రావుకి 2,00,109. రూపాయలు మహాలక్ష్మికి ఏడు లక్షల 50 వేలు చొప్పున మొత్తం 7 లక్షల పదకొండు వేల 200 రూపాయలు విలువ గల చెక్కులను పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు నారా చంద్రబాబునాయుడుకి ఎమ్మెల్యే మురళీమోహన్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ మండలాధ్యక్షునికి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండల టీడీపీ అధ్యక్షుడు అక్కింతల కృష్ణ యాదవ్ జన్మదినం పురస్కరించుకుని టీడీపీ సీనియర్ తాటిపర్తి ఈశ్వరరెడ్డి దంపతులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎంపేడులోని తాటిపర్తి ఈశ్వరరెడ్డి స్వగృహానికి చేరుకున్నారు. అక్కడ ఆయనను ఈశ్వరరెడ్డి దంపతులు ఆశీర్వదించారు. ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో చైర్మన్ తాటిపర్తి ఈశ్వరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు అంకయ్య చౌదరి పాల్గొన్నారు.

శుభగిరి నాయుడుని పరామర్శించిన మోహిత్ రెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి సర్పంచ్ బొల్లినేని సుభాషిణి ఇటీవల మరణించడంతో ఆమె భర్త బొల్లినేని శుభగిరి నాయుడును చంద్రగిరి నియోజకవర్గం వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి శనివారం పరామర్శించారు. సుభాషిణి సేవలు గ్రామ పంచాయతీ ప్రజలు ఎన్నటికీ మరువలేరని, ఆమె మరణం గ్రామానికి తీరని లోటు అన్నారు. గ్రామంలో కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు చేసి ప్రజల గుండెల్లో సుస్థిరస్థానాన్ని దక్కించుకున్న సుభాషిణి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. అనంతరం శుభగిరి నాయుడుతో మాట్లాడిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ధైర్యంగా వుండాలని, కుటుంబానికి పెద్ద దిక్కుగా అందరి బాగోగులు చూసుకోవాలని ఓదార్చారు. చివరగా తాను ఎంపీపీగా వున్నంత కాలం సర్పంచ్ హోదాలో సుభాషిణి గ్రామ అభివృద్ధి గురించి చర్చించిన అంశాలను చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, దొరస్వామి, పాకాల ఎంపీపీ లోకనాథం, మండల పార్టీ అధ్యక్షులు నంగా నరేష్ రెడ్డి, సింహాల మోహన్, మునీశ్వర రెడ్డి, దయ్యాల మాదవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు వున్నారు.

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె,మంచినూనె, పాలు,పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

జీ తెలుగులో జులై 14 నుంచి సరికొత్త సీరియల్ జయం!

విశాలాంధ్ర/తిరుపతి: తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎల్లప్పుడూ వినోదం పంచే ఛానల్ జీ తెలుగు. ఊహించని మలుపులు, ఆసక్తికర కథనాలతో సాగే సీరియల్స్‌తో ఆకట్టుకుంటోన్న జీ తెలుగు సరికొత్త సీరియల్ 'జయం' తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రేమ, మోసం, పట్టుదల, బాధ్యతల నడుమ సాగే సరికొత్త ప్రేమ కథతో రూపొందుతున్న సీరియల్ జయం. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూ ఎలా ముందుకు సాగాలో తెలిపే స్ఫూర్తివంతమైన కథతో ఈ సీరియల్ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆకట్టుకునే కథతో రానున్న జయం, జులై 14న ప్రారంభం, సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు రాత్రి 8 గంటలకు, జీ తెలుగులో ప్రసారమవుతుంది. జయం సీరియల్ కథ మాజీ బాక్సర్ రుద్రప్రతాప్(శ్రీరామ్ వెంకట్), పేదింటి అమ్మాయి గంగావతి(వర్షిణి) జీవితాల చుట్టూ తిరుగుతుంది. రుద్ర తన సోదరుడి మరణం, చెరగని గాయాలతో కూడిన గతంతో సతమతమవుతుండగా, పేదరికం, తల్లి అనారోగ్యం, తండ్రి బాధ్యతారాహిత్యంతో గంగ జీవితం దినదిన గండంగా సాగుతుంది. వీరిద్దరూ ఎలా కలుస్తారు? వారి మధ్య ప్రేమ చిగురిస్తుందా? గతాన్ని అధిగమించి ముందుకు వెళ్లగలరా? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే జయం సీరియల్ చూడాల్సిందే. జయం ఒక ప్రత్యేకమైన కథ అని ప్రముఖ నటుడు శ్రీరామ్ వెంకట్ అన్నారు. జయం సీరియల్ జులై 14 నుంచి ప్రతి సోమవారం నుంచి శనివారం రాత్రి 8 గంటలకు జీ తెలుగులో ప్రసారం కానుంది. ఈ సీరియల్ ప్రారంభంతో ఇతర ధారావాహికల ప్రసార సమయాల్లో స్వల్ప మార్పులు ఉంటాయి. జులై 14 నుంచి, చామంతి రాత్రి 8:30 గంటలకు, జగద్ధాత్రి రాత్రి 9 గంటలకు ప్రసారమవుతాయి.

ఘనంగా 5వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - తిరుపతి: ఆంధ్రప్రదేశ్ గ్రాప్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్ 2025 పోటీలు తిరుపతిలోని గిరిజన భవన్ ఇండోర్ హాల్‌లో జూలై 12న ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో సబ్-జూనియర్ మరియు క్యాడెట్ (బాయ్స్- గర్ల్స్) విభాగాల్లో రాష్ట్రం నలుమూలల నుండి అథ్లెట్లు పాల్గొన్నారు.దీపప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏపీ క్రీడా భారతీ అధ్యక్షులు ఎం.వి. మణిక్యాలు (ఓలింపియన్) ,భారతీయ జనతా పార్టీ, తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు సి. చంద్రప్ప, ఏపీ క్రీడా భారతీ కార్యదర్శి పి.ధనంజయ రెడ్డి,జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎన్. సశిధర్,విశ్వం విద్యాసంస్థలు అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి,ఎస్.జి.ఎఫ్ తిరుపతి జిల్లా మాజీ కార్యదర్శి జయరామయ్య,ఏపీ ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి మురళీకృష్ణ,ఏపీ గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఏ.జి. రేఖా రాణి, విష్ణువర్ధని లు పాల్గొనట్లు ఏ.పి. స్పోర్ట్స్ క్రీడ భారతీ జాయింట్ సెక్రటరీ మరియు సభాధ్యక్షులు సురేంద్ర రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా అతిథులు భారతీ య జనతా పార్టీ, తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు చంద్రప్ప మాట్లాడు తూ గ్రాప్లింగ్ వంటి క్రీడలు యువతలో ధైర్యం, సహనం మరియు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయి. ఈ తరహా పోటీలు క్రీడా సంస్కృతిని ప్రోత్సహించడానికి ఉపయుక్తం అని తెలిపారు.విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి మాట్లాడుతూ "క్రీడలు విద్యకు పూరకంగా ఉండాలి,బోధనతో పాటు క్రీడల్లో శ్రమిస్తే ప్రతి విద్యార్థి చరిత్ర సృష్టించగలరు. గ్రాప్లింగ్ లాంటి పోటీలు వ్యక్తిత్వ వికాసానికి బలమైన పునాది అని తెలిపారు.ఈ పోటీలు జూలై 13వ తేదీ వరకు కొనసాగుతాయి, మరియు విజేతలకు మెడల్స్, బహుమ తులు అందజేయబడతాయి అని తెలిపారు.

ఆర్.పి.లతాపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

- కోటి రూపాయల మహిళల డబ్బు స్కామ్‌లో భాగస్వాములైన బ్యాంక్ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలి
- డ్వాక్రా మహిళలకు సొమ్ము రికవరీ చేయాలి
- బాధ్యులపై ఆర్ఆర్ యాక్ట్‌ను పెట్టాలి : సిపిఐ

విశాలాంధ్ర - తిరుపతి: తిరుపతి కార్పొరేషన్ పరిధిలో మూడవ డివిజన్లో తమిళ్ పాఠశాలలో 33 డ్వాక్రా సంఘాల మహిళలు గత ఆరు నెలల కాలంగా వారు బ్యాంకుకు చెల్లించిన డబ్బులు బ్యాంకు అధికారు లతో కలిసి ఆర్పి లతా దాదాపుగా కోటీ రూపాయల నిధులను దుర్వి ని యోగం చేసిందని ఇది తిరుపతి వెలుగు చరిత్రలో అతిపెద్ద స్కామ్ అని దీనిలో భాగస్వాములైన అందరిపై తగు చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు.మూడవ డివిజన్ పరిధిలో తమిళ్ పాఠశాల వద్ద ఆర్పీ లతాను 33 డ్వాక్రా సంఘాల మహిళలు కలిసి ఆమె చేసిన అవినీతిపై నిలదీయడం జరిగింది ఆమె సరైన సమాధానం చెప్పకపోవడంతో సిపిఐ నాయకులు జిల్లా కార్యదర్శి మురళి నగర కార్యదర్శి విశ్వనాథ్ ఏఐటియుసి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి సిహెచ్ శివకుమార్ లు వెళ్లి మహిళలకు అండగా నిలబడటం జరిగింది వివరాలను లెక్కలను పరిశీలన చేయగా ఆర్పి లతాతో పాటు బ్యాంకు అధికారుల పాత్ర చాలా ఎక్కువగా ఉందని వెలుగు అధికా రులు కూడా పర్యవేక్షణ లేకుండా స్వేచ్ఛగా వదిలివేయడం సరైనది కాదని ఇందులో వెలుగు అధికారుల ప్రమేయం ఎంత ఉందో బ్యాంకు అధికారుల ప్రమేయం ఎంత ఉందో ఆర్పి లతా యొక్క పాత్ర ఎంత అన్నది నిజ నిర్ధారణ చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అందుకోసం దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆర్పి లతా పై క్రిమినల్ కేసు వెంటనే నమోదు చేయాలని 350 మంది డ్వాక్రా మహిళల డబ్బులు రికవరీకి ఎలాంటి అవకాశాలు ఉన్నాయి ఎవరెవరి పాత్ర ఉందో వారందరి దగ్గర నుండి ఆర్ఆర్ యాక్ట్ పెట్టి రికవరీ చేయాలని. డ్వాక్రా మహిళలకు రక్షణగా నిలవాలని వారి సొమ్ముకు భద్రత కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారుమహిళలకు న్యాయం జరగాలని న్యాయం జరగని పక్షంలో సోమవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

ముక్కంటి సేవలో మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఈయనకు దక్షిణ గోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మ వార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా కొల్లు రవీంద్ర కుటుంబ సభ్యులతో కలసి ఊరందూరులోని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఇంటికివెళ్లారు. అక్కడ వారితో కొద్దిసేపు ముచ్చటించారు.

ఫొటోగ్రాఫర్ శివకుమార్‌ని పరామర్శించిన మంత్రి మండిపల్లి

- రెండు లక్షల ఆర్థిక సహాయం అందించిన మంత్రి

విశాలాంధ -చిత్తూరు : చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ పై ఇటీవల వైసీపీ రౌడీ మూకల దాడిలో గాయపడి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివకుమార్‌ను రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శనివారం పరామర్శించి, ప్రభుత్వ పరంగా రెండు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసిపి నాయకుల ప్రోద్బలంతో దాడి జరిగిన విధానం గురించి శివకుమార్ వివరిస్తుంటే చాలా బాధ కలిగిందనీ ,నిజాన్ని నిర్భయంగా రాసే పత్రికలపై, మీడియా ప్రతినిధులపై ఈ తరహా దాడులను క్షమించేది లేదన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. శివకుమార్ పై దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని. మీడియా హక్కులను కాపాడే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరి స్తుందనీ తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్‌కు అందిస్తున్న వైద్య సేవల పై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చూడ చైర్ పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో మంత్రి కొల్లు

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని గనులు, భూగర్భం, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లురవీంద్ర శనివారం దర్శించుకున్నారు. ఆలయ డిప్యూటీ ఈఓ హరేంద్రనాథ్, సూపరింటెంట్ రమేష్, ఏవీఎస్ఓ రాధాకృష్ణ మూర్తి ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శన ఏర్పాట్లు ప్రత్యేకంగా నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం మండపంలో ఆయనను వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికా రులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రపంచ పోలీసు క్రీడల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించిన వీజీవోలను అభినందించిన టీటీడీ చైర్మన్

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : ఇటీవల అమెరికాలో జరిగిన ప్రపంచ పోలీసు క్రీడల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించిన టీటీడీ వీజీవోలు సురేంద్ర, రామ్ కుమార్ లు శనివారం తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి తమ పతకాలను చూపారు.టీటీడీ ప్రతిష్ట మరింత పెంచేలా విజయం సాధించిన ఇరువురు భద్రతాధికారులను టీటీడీ చైర్మన్ అభినందించారు.

టిటిడి చైర్మన్‌ను కలసిన ఎమ్మెల్యే నాని



విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమల టిటిడి చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు నీ మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే పులివర్తి నాని చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను వివరించిన ఎమ్మెల్యే పులివర్తి నాని టీటీడీ ఆలయాలు, కళ్యాణమండపాలను, అభివృద్ధి చేయాలనికోరగా ముఖ్యంగా శ్రీవారి మెట్టు మార్గాన వచ్చే భక్తులకు సేదతీరడం కోసం చంద్రగిరి మండలంలో నూతన వసతి సముదాయాలు ఏర్పాటు చేయాలనిచంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజలకు నెలలో ఒక రోజు ఉచిత దర్శనాలు కల్పించాలని చైర్మన్ ను కోరిన ఎమ్మెల్యే పులివర్తి నాని. సానుకూలంగా స్పందించిన టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు.

జనసేన నుంచి వినూత బహిష్కరణ

విశాలాంధ్ర - తిరుపతి : శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్ చార్జ్ వినూత కోట ను జనసేన పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ లు తెలిపారు. కొద్దికాలంగా పార్టీ కార్యకలాపాలకు వినూత దూరంగా ఉన్నట్లు ఎమ్మెల్యే నివాసంలో శనివారం మధ్యాహ్నం జరిగిన మీడియా సమావేశంలో వారు చెప్పారు. చెన్నైలో వినూతపై హత్యా నేర అభియోగం నమోదు కావడంతో ఆమెను పార్టీ నుంచి బహిష్కరించి నట్లు వారు చెప్పారు. పార్టీ విధివిధానలకు, క్రమశిక్షణకు ఎవరైనా భిన్నంగా నడుచుకుంటే బహిష్కరణకు గురికావడం తథ్యమని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పలుసార్లు హెచ్చించారని వారు తెలిపారు. ఎవరైనా పార్టీ గీత దాటితే బహిష్కరణ తప్పదని వినూత కోట విషయంలో నిరూపమైందని వారు వెల్లడించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రాజా రెడ్డి, రాజేష్ ఆచ్చారి, బాబ్జి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.